


# దొంగల్లో దొంగ

"నీకు బాగా తెలుసా, ఆ డబ్బు సంగతి?"

అడిగాడు మార్కండేయని, అతని స్నేహితుడు.

"చాలా ఖచ్చితంగా తెలుసు"

చేతి గడియారంవంక చూసుకున్నాడు మార్కండేయ, రెండుకి ఐదు నిముషాలు తక్కువ. ఓసారి బేంక్‌వైపు చూశాడు, సిగరెట్ తాగుతూ.

బేంక్ గేటు దగ్గర ఖాకీరంగు బట్టల్లో కూర్చుని వున్నాడు వాచ్‌మెన్ స్టూలుమీద శ్రద్ధగా. భుజాన పొడుగాటి బారెల్ గల తుపాకి వేలాడుతోంది. భుజానికి వున్న వెడల్పాటి బెల్టుకి కేట్రిడ్జెస్ వున్నాయి అక్కడక్కడా.

"వాచ్‌మెన్ చేతిలో తుపాకి వుంది" అన్నాడు మార్కండేయ స్నేహితుడు.

"భయమా?" అడిగాడు మార్కండేయ.

"ఇది నాకు కొత్త"

సన్నగా నవ్వి అన్నాడు మార్కండేయ అతని భుజం తడుతూ.

"పద్నాలుగేళ్ళనుంచీ నేను దొంగతనాలు చేస్తున్నాను. అన్ని

రకాల దొంగతనాలు చేశాను. జేబులు కొట్టడం, ఇళ్ళలో జొరబడి అందిన వస్తువులు దొంగిలించడం లాంటివి చాలా చేశాను భయపడకు. నీకేం కాదు"

"భయంలేదు నాకు కొత్త అన్నాను అంతే.

"ఓసారి ఏం చేశానో తెలుసా?"

ఏమిటన్నట్లుగా చూశాడు మార్కండేయ స్నేహితుడు

"ఓ కత్తికి చివర ఎర్రటి తిలకం పూసి, చేతులకి బట్టలకి కొంచెం పూసుకుని ఓ సర్కస్ కంపెనీ టిక్కెట్లు అమ్మే కేబిన్‌లోకి వెళ్ళాను రెండువేల చిల్లర దొరికింది."

"కత్తి చివర తిలకం పూయడం దేనికి?"

మార్కండేయ దృష్టి బేంక్ ముందు ఆగిన ఓ ఫియట్‌కారు మీద పడది. దాంట్లోంచి చేతిలో ఓ ఎల్లతోలు బేగ్‌తో నలభై ఏళ్ళతను దిగాడు వెనకాలే మరో నలుగురు దిగారు అతనితోపాటు.

"అదుగో! అతనే నాకు అందిన సమాచారం నిజమయినదే" అన్నాడు మార్కండేయ స్నేహితునితో.

ఉత్సాహంగా మార్కండేయ స్నేహితుడు కారులోంచి దిగినతని చేతిలోని తోలుసంచీవంక చూస్తూ అన్నాడు.

"నలుగురు వున్నారు కాపలా"

"వాళ్ళలో ఒకరి దగ్గర లైసెన్స్‌డ్ రివాల్వర్ కూడావుంది.అందుకే ఇంత సేపూ వేచివుండటం.

"ఇందాక అడిగాను కత్తికి తిలకం పూయడం దేనికి?"

"అదిచూసి రక్తమని భయపడతారు. ఎ[illegible]కయినా అప్పుడె ఎవరినో పొడిచి వస్తున్నాననే భ్రమ కలుగుతుంది, అర్ధరాత్రి అకస్మాత్తుగా ఆ కత్తితో ఒగురుస్తూ ప్రత్యక్షమయితే"

"హత్య చేసేందుకు వెరవడని భయపడి వెంటనే వున్న డబ్బంతా ఇచ్చేస్తాడు అంతేనా?"

"అవును. టైం ముఖ్యం. వీలయినంత త్వరగా డబ్బు గుంజుకుని పారిపోవాలి.

పాత సిగరెట్ తో మరో కొత్త సిగరెట్ వెలిగించాడు మార్కండేయ. అతని స్నేహితుడికో సిగరెట్ అందించాడు. హుషారుగా వున్నాడు మార్కండేయ ఇప్పుడు.

"మనం లేచినవేళ మంచిది. ఈ సంగతి తెలుసుకోడానికి అయిదు వందల రూపాయలు ఖర్చుపెట్టాను. తెలుసా?"

మౌనంగా సిగరెట్ తాగుతూండిపోయాడు మార్కండేయ స్నేహితుడు.

"అదుగో అతను తెలుసా?"

"చేతితో చూపించకుండా, కళ్ళతోనే బేంక్‌లోంచి బయటకివస్తున్న ఓ వ్యక్తివంక చూపించాడు మార్కండేయ తన మిత్రుడికి.

"తెలీదు" చెప్పాడు మిత్రుడు.

"కొన్నాళ్ళ మే మిద్దరం కలసి పనిచేశాము. ఇక్కడ కాదు. బెంగుళూరులో అతను దొంగతనం చేసేపద్ధతి తెలుసా?"

"తెలీదు ఎట్లా?'' అడిగాడు మార్కండేయ మిత్రుడు కొంచెం ఆసక్తిగా.

"బేంక్‌లో వెర్లిన్ బట్టల్లో తిరుగుతూ, డబ్బు విత్ డ్రా చేసుకునే ముసలివాళ్ళకి, ఆడవాళ్ళకి సహాయం చేస్తున్నట్లు నటిస్తాడు. వాళ్ళు డబ్బు తీసుకుని బయటికి రాగానే పరిగెత్తుకెళ్ళి వందరూపాయలు పొరపాటున ఎక్కువ ఇచ్చేశారని చెబుతారు.''

దానివల్ల అతడికి లాభం ఏమిటి? వాళ్ళు లెక్కపెట్టుకుంటారుగా?''
''అవును డబ్బు సరిగా వుంటుంది. తనకి నమ్మకం కుదరనట్లు

నటిస్తాడు. బేంక్ ఉద్యోగస్థుడనే ఉద్దేశంతో మీరే లెక్కపెట్టండని ఇస్తారు డబ్బు లెక్కపెడుతూనే మాయమవుతాడు ఆ డబ్బుతో"

"బాగుంది మరి మీరెందుకు మానేశారు ఆ పద్ధతి"

పకపక నవ్వాడు మార్కండేయ.

"మానేయకపోతే ఇవాళ ఇరవై రెండు లక్షలు సాధించగలమా?"

"ఇరవై రెండు లక్షలే?" సంతోషాన్ని అణచుకుంటూ అన్నాడు మార్కండేయ మిత్రుడు.

"అవును" గర్వంగా అన్నాడు.

"బాగా తెలుసా మీకు?"

"తెలుసు. వందరూపాయలు అన్నీ. ఇరవై రెండు బండిల్స్ మొత్తం. ఒక్కొక్క బండిల్‌లో పదికట్టలు సరిగ్గా వుంటవి"

మార్కండేయ స్నేహితుడి కళ్ళు మిలమిలా మెరిశాయి.

వాళ్ళలో ఒకరి దగ్గర పిస్తోలు వుందన్నారుగా?" కొంచెం సేపాగి అడిగాడు.

"ఫర్వాలేదు చూస్తాండు"

"బయటికి వస్తున్నారు వాళ్ళు"

"ఉత్సాహంగా అన్నాడు మార్కండేయతో అతని స్నేహితుడు.

బేంక్‌లోంచి వాళ్ళు అయిదాగురు తోలుబేగ్‌తో వచ్చి ఫియట్ కారులో కూర్చున్నారు. కొద్ది క్షణాలలో కారు స్టార్టుచేసి ముందుకి పోనిచ్చాడు డ్రయివర్.

"కమాన్"

స్నేహితుడి చేయి పట్టుకులాగి కొంచెం దూరంలో ఆగివున్న జీప్‌లోకి దూకి స్టీరింగ్ వీల్ ముందు కూర్చుని స్టార్టు చేశాడు జీప్. వేగంగా పోనిచ్చాడు జీప్‌ని మార్కండేయ.

ముందు వెళుతున్న ఆ ఫియట్‌కారు వెనకాలకాదు, బేంక్ వైపు.

"కారు అటువైపు వెళ్ళిపోతోంది ఖంగారుగా అన్నాడు మార్కండేయ స్నేహితుడు.

"ఫర్వాలేదు అది ఖాళీ బేగ్. అందులో డబ్బులేదు"

"మరి"

"ఆ డబ్బు యిప్పుడు రిసీవింగ్ కౌంటర్‌లో వుంది"

"వాళ్ళు డబ్బు బేంక్‌లో డిపాజిట్ చేశారా?"

"అవును అందుకే ఆగాను. బేంక్‌లోంచి దోచుకోవడం తేలిక. వాళ్ళు కారు ఆపి దోచుకోవడం కష్టం. అందులో ఒకరి దగ్గర పిస్తోలు వుంది"

"మార్కండేయ స్నేహితుడు నోరు మెదపలేదు. ఆశ్చర్యంగా చూస్తున్నాడు జరుగుతున్నది.

మార్కండేయ చకచకా జీప్ స్టీరింగ్ వీల్‌ని తిప్పసాగాడు.

అలవాటు ప్రాక్టీసు.

జీపు చక్రాలు బేంక్ మెట్లు ఎక్కి తిన్నగా బేంక్‌లోకి ప్రవేశించింది. క్షణం వృధా చేయలేదు. మార్కండేయ స్నేహితుడు సిద్ధంగా వుంచుకున్న ఓ టపాకాయల గుత్తి చివర సిగరెట్‌తో అంటించి బేంక్ లోపలికి విసిరేసాడు. మార్కండెయ స్వయంగా తయారుచేసిన ప్రేలుడు టపాకాయల గుత్తి అది.

బేంక్‌నిండా టపాకాయలు పేలుతున్నాయి. అక్కడక్కడా చెల్లా చెదురుగా పడి చెవులు దద్దరిల్లే చప్పుడి.

మార్కండేయ చేతులు స్టీరింగ్‌వీల్ మీద నాట్యం ఆడాయి. సరిగా కేష్ రిసీవింగ్ కౌంటన్ ముందు ఆగింది జీపు.

"క్వీక్"

"స్టీరింగ్ వీల్ ముందునుంచి కిందకి దూకాడు మార్కండేయ. ఓసారి చుట్టూ చూశాడు అతని స్నేహితుడు కూడా దిగి.

కొంచెం దూరంలో నిలబడి చూస్తున్నాడు బేంక్ వాచ్‌మన్ తత్తర పాటుతో వెంటనే బేంక్ గేటువైపు పరిగెత్తాడు.

"క్విక్ నే నిచ్చిన కత్తులు ఉపయోగించు" అరిచాడు మార్కండేయ.

మార్కండేయ స్నేహితుడు అలాగే నిల్చుండిపోయాడు చూస్తూ.
బేంక్ వాచ్‌మన్ చేతులు పైకెత్తి షట్టర్ లాగుతున్నాడు పక్కకి.

మార్కండేయ చేతులు చురుకుగా పనిచేశాయి. రెండు చేతులతో విసిరిన ఆరంగుళాల కత్తులు రెండు వెళ్ళి షట్టర్ను లాగుతున్న వాచ్‌మన్ వీపులో దిగబడ్డాయి నాలుగంగుళాల లోతుగా. షట్టర్ను పూర్తిగా లాగకుండా అలాగే ముందుకి వాలిపోయాడు వాచ్‌మన్ గట్టిగా అరుస్తూ.

మార్కండేయ మెరుపులా కౌంటరు మీదకి ఎక్కాడు జీపు వెనక భాగంలోంచి తీసుకున్న నాలుగడుగుల పొడుగాటి కత్తితో.

దూకుతున్న మార్కండేయని చూస్తూనే కౌంటరులోని క్లర్కులోపలికి పరిగెత్తారు వణికిపోతూ.

క్షణం కూడా ఆలస్యం చేయలేదు మార్కండేయ. కింద సిద్ధంగా వున్న బేంక్ ఇనపకేష్‌బాక్సు అందుకుని మళ్ళీ కౌంటరు ఎక్కి బయటకి దూకాడు.

కత్తి గిరగిరా తిప్పుతునే వున్నాడు మార్కండేయ. జీపులో స్టీరింగ్ వీల్ ముందు కూర్చునేదాకా. అలా నాలుగడుగులు పొడవుగల కత్తి తిప్పుతున్నంత సేపు ఎవరయినా ఇద్దరు ధైర్యస్థులు దగ్గరికి రాలేరు. కదలకుండా పట్టుకునేందుకు ధైర్యం చాలదు.

"కూర్చో నీవల్ల ఉపయోగంలేదు."

మార్కండేయ స్నేహితుడు జీపులో మార్కండేయ పక్కనే కూర్చున్నాడు మౌనంగా.

రివర్స్‌గేరులోనే పోనిచ్చాడు మార్కండేయ జీప్‌ని. పోనిస్తూ చూసాడు చుట్టూ.

బేంక్‌కి వచ్చిన కస్టమర్స్ ఎక్కడి వాళ్ళు అక్కడే బొమ్మల్లాగా, కదల కుండా శిలా ప్రతిమల్లాగా వుండిపోయారు. మార్కండేయ వంక భయంగా కళ్ళప్పగించి చూస్తూ.

ఏ మాత్రం కదిలినా ఆ కత్తితో తమని పొడిచేస్తాడని వాళ్ళ భయం. రక్తం కారుతున్న బేంక్ వాచ్‌మన్‌ని చూసి ఓ ముసలావిడ స్పృహ తప్పి క్రింద పడిపోయింది.

"జయించాం. చూసావా?"

నవ్వుతూ, కేష్ బాగ్స్‌ని చేతితో తట్టి అన్నాడు మార్కండేయ, పక్కన కూర్చుని వున్న స్నేహితునితో.

మాట్లాడలేదు అతను.

మూలుగుతున్న వాచ్‌మన్ మీద నుంచి బయటకి పోనిచ్చాడు మార్కండేయ జీప్‌ని. బాధగా కేక పెట్టాడు వాచ్‌మన్.

అప్పటికే బయట కొద్దిగా గుమిగూడి వున్నారు దారిన పోయే వాళ్ళు. బేంక్‌లోంచి, మెట్లమీద నుంచి, దిగివస్తున్న జీపు వంక వింతగా చూస్తూ.

ఆ గుంపులోని ఒకడు, జీపుకి అడ్డంగా పరిగెత్తుకొచ్చాడు. ఆప మని చేయి వూపుతూ మిలటరీ యూనిఫారంలో వున్నాడు.

భీకరంగా, వీలయినంత గట్టిగా అరిచి, అడ్డంగా వస్తున్న మిలటరీ అతని మీదకి గురిచూసి విసిరాడు కత్తిని. కత్తి దెబ్బ తగిలి కిందకి ఒరిగి పోయాడు అతను అరుస్తూ.

జీపుని ఆపుదామని ముందుకు వచ్చే మరో ఇద్దరు వెనక్కితగ్గారు. వెంటనే గుంపు చెల్లా చెదరయిపోయింది, తమ మీదకి కూడా కత్తివచ్చి పడుతుందనే భయంతో.

జీపుని మేయిన్ రోడ్ మీదకి తీసుకువచ్చి, గేర్ మార్చి, కసిగా నొక్కాడు ఏక్సిలేటర్‌ని మార్కండేయ. వేగం అందుకుంది జీపు.

"భయం వేసిందా నీకూ్కడా? నవ్వుతూ అడిగారు మార్కండేయ తన స్నేహితుడి వంకచూసి.

"లేదు"

అతని గొంతులో తడారిపోయింది.

"నీ మొహంచూస్తేనే తెలుస్తోంది. భయం వేసిందో లేదో" పకపకా నవ్వాడు మార్కండేయ.

"కత్తిని విసరమంటే ఇందాక ఎందుకని విసరలేదు?" అడిగాడు రోడ్డు మీదకి చూస్తూ.

"నేను దొంగతనాలు చాలా చేసాను కాని, ఎప్పుడూ ఎవరినీ చంపలేదు."

"మొదటిసారి నేనూ భయపడ్డాను తెలుసా? భయంతో అలాగే నిల్చుండిపోయాను, చేతిలో కత్తితో నన్ను చూసి ఇంకా వణికి పోయాడు ఆ ముసలాడు. కళ్ళుమూసుకుని పొడిచేసాను. మూడుసార్లు అంతే. ఎవడో ఒకడిని పొడిస్తేచాలు, మిగతా వాళ్ళు చచ్చినా మనజోలికి రారు."

మాట్లాడలేదు అతను.

"తెగింపు వుండాలి దేనికయినా. వాచ్‌మన్ షట్టర్స్ మూసేస్తే మనం పట్టుబడిపోతాం. జీపులో పారిపోలేం. మరోదారి వెంటబయటపడ్డా"

"ఐయాం సారీ. మరోసారి జాగ్రత్తగా వుంటాను."

"మరోసారి అంటూ వుండదు. ఈ డబ్బు చాలు హాయిగా గడిపేందుకు, ఓ పదేళ్ళదాకా."

రెండు నిముషాలయినా కాలేదు. తృప్తిగా ఓ చెయ్యి చేతిలోని

కేష్ బాక్స్‌మీదా మరో చెయ్యి స్టీరింగ్ వీల్‌మీదా వేసి కూర్చున్న మార్కండేయకి, పోలీస్ పెట్రోల్ కారు సైరన్ వినిపించింది వెనుకనించి.

భీతిగా చూసాడు మార్కండేయ స్నేహితుడు వెనక్కి తిరిగి, తమ జీపు వెనకే వస్తున్న పోలీస్ కారువంక.

మార్కండేయ రెండు చేతులతో స్టీరింగ్ వీల్ గట్టిగా పట్టుకుని, స్పీడ్ పెంచాడు వెంటనే.

దాదాపుగా ట్రాఫిక్ అంతా ఆగిపోయింది. డెభ్బై మైళ్ళ వేగంతో వస్తున్న ఆ జీపునిచూసి, కార్లు, మోటర్ సైకిళ్ళు, బస్సులు—సమస్తం రోడ్డు పక్కన ఆగిపోయి జీపుకి దారిఇచ్చాయి. కొన్ని కార్లు సైకిళ్ళు ఫుట్‌పాత్ మీదకి ఎక్కిపోయాయి.

నిర్లక్ష్యంగా నడుపుతున్నాడు మార్కండేయ జీప్‌ని. హారన్ నొక్కిపట్టి వుంచి నడుపుతున్నాడు. డెభ్బై మైళ్ళ వేగంతో.

ఓ హెరాల్డ్ కారుని, ఓ అంబాసిడర్ కారుని పిండి చేసాడు. అడ్డంగా వచ్చినందుకు. పక్కనేవున్న కేష్‌బాక్స్‌లోని డబ్బు, ముందు ఇతరుల ప్రాణాలు గడ్డిపరకతో సమానం మార్కండేయకి.

సందులు, గొందులు తిరగడానికి వీలులేదు. చాలాపెద్ద మెయిన్ రోడ్ అది. రోడ్డుకి రెండువైపులా షాప్స్, ఆఫీసులు, ఇళ్ళు,సందులులేవు.

కొన్ని నిముషాల తర్వాత మరో మెయిన్‌రోడ్‌లోకి తిరిగాడు మార్కండేయ. అద్దంలోంచి చూసాడు. ఒకటికాదు. రెండు పోలీస్‌కార్లు ఇప్పుడు వెనకాల వస్తున్నాయి.

పక్కనే కూర్చుసున్న స్నేహితుడివంక చూసాడు. భయంతో వణికి పోతున్నాడు. బయటపడిపోకుండా సీట్‌ని గట్టిగా పట్టుకుని.

చిన్నగా నవ్వుకున్నాడు మార్కండేయ. తనలోని కలవరాన్ని బయటికి కనపడకుండా వుండేందుకు ప్రయత్నిస్తూ.

"ఇంకోటి"

అరిచాడు మార్కండేయ స్నేహితుడు. ఎదురుగా రోడ్డుమీదకి చూస్తూ.

"చూసాను."

స్టీరింగ్‌వీల్‌ని బలంగా తిప్పాడు. జీప్‌చక్రాలు ఫుట్‌పాత్ మీదకి ఎక్కి, షాప్స్‌గోడలని రాసుకుంటూ దూసుకుపోయింది. పోలీస్‌పెట్రోల్ వాన్‌కి కొంచెం దూరంలో.

పెట్రోలు కారులోంచి వచ్చిన మొదటిరివాల్వర్‌గుండు మార్కండేయకి తగలేదు.

రివాల్వర్ చప్పుడు వినగానే జాగ్రత్త పడాలనుకున్నాడు. కాని సీటులో ముందుకి వంగేలోపలే మరోసారి పేలింది రివాల్వర్.

భుజంలో కాలుతున్న ఇనుపగుండు పెట్టినట్లుగా ఫీల్ అయ్యాడు మార్కండేయ. భుజంలోంచి నెత్తురు కారుతోంది. నెత్తురుతో తడిసి పోతోంది షర్టు.

"పొరపాటు చేసాను. జీప్ పక్కకి తీసుకువెళ్ళకుండా. సరాసరి పోలీస్ వేన్‌మీదకి పోనివ్వాల్సింది. చచ్చేవాళ్ళు."

మార్కండేయ స్నేహితుడు మాట్లాడలేదు.

"ఇప్పుడు భయంగానే వుంటుంది నీకు. ఇదంతా తలుచుకుంటే, తర్వాత సరదాగా వుంటుంది."

పక్కకి తలతిప్పిచూసి చిన్నగా నిట్టూర్చాడు.

సీటుమీద ఒరిగిపోయివున్నాడు మార్కండేయ స్నేహితుడు, కళ్ళు మూసుకుని. రివాల్వరు గుండు ఎక్కడ తగిలిందో కనపడలేదు. చలనంలేదు అతనిలో.

తనపని కూడా మరికొన్ని నిముషాలలో అయిపోతుందని గ్రహించాడు మార్కండేయ. భుజంలోంచి నెత్తురు కారిపోతూండటంవల్ల బలహీనత ఆక్రమిస్తోంది. చేతులు స్వాధీనం తప్పుతూన్నాయి.

ఆలోచించసాగాడు. తనని పోలీసులు పట్టుకునే అవకాశాలు

ఎక్కువ. ఇంతకష్టపడి సంపాదించిన డబ్బంతా చేజారిపోకూడదు. పోలీసుల పరం కాకూడదు అది.

జాగ్రత్త పెట్టాలి ఎక్కడయినా. ఎక్కడ? ఎవరికీ చిక్కకుండా, వెనకాలవచ్చే పోలీసుల కళ్ళబడకుండా. ఈ నడిరోడ్డుమీద దాయటంఎలా? ఎక్కడ?

వెనకాల మూడు పోలీస్ వేన్‌లు తరుముకుంటూ వస్తున్నాయి. సైరన్ వూదుకుంటూ.

రక్తం విపరీతంగా కారిపోతోంది, జీప్‌కుదుపులవల్ల,స్టీరింగ్‌విల్‌తో పాటు తిరిగే చేతులు కదలికవల్ల, నిస్సత్తువ ఆక్రమిస్తోంది తనని, వెంటనే ఏదయినా చెయ్యాలి.

ఏం చెయ్యాలి?

ఎవరికయినా ఇవ్వాలి ఆ కేష్‌బాక్స్. తను జైలునుంచి తప్పించుకుని రాగానే మళ్ళీ తీసుకోవాలి. పోలీసుల దృష్టిలో పడకుండా.

ఎలా? ఎవరు తిరిగి ఇస్తారు. ఇరవై రెండు లక్షలు?

ఓ నిర్ణయానికి వచ్చేసాడు మార్కండేయ.

జీప్ వేగం తగ్గించకుండానే, కేష్‌బాక్స్ తెరచి చూసాడు.

వంద రూపాయల కట్టలు నీట్‌గా అమర్చబడి వున్నాయి బాక్స్‌లో. గబగబా లెక్కపెట్టాడు. సరిగానే వున్నాయి. మొత్తం ఇరవై రెండు లక్షలు పైన వున్నాయి.

ఓసారి ఆప్యాయంగా వాటిని చేత్తోతడిమి, కేష్‌బాక్స్‌మూసేశాడు జీప్ వేగం తగ్గించాడు కొద్దిగా.

వెంటనే జీప్‌ని పక్కసందులోకి తిప్పాడు చటుక్కున గుండె గుబగుబలాడింది మార్కండేయకి తన పథకం విజయవంతం అవుతుందా? ఇంతా కష్టపడ్డాక ఎవరిపాలో అవుతుందా?

రెండెరెండు క్షణాలు. జీప్ వేగం పూర్తిగా తగ్గించేసాడు. జీప్‌ని ఆపాడు, రోడ్‌పక్కన ఆగివున్న బూడిదరంగు అంబాసిడర్ కారుపక్కనే.

కేష్‌బాక్స్‌ని చటుక్కున బూడిదరంగు అంబాసిడరు కారులోకి విసిరాడు.

ఆకారు స్టీరింగ్ వీల్ ముందు కూర్చునివున్నాడు ఓ ఏభై ఏళ్ళతను రోల్డ్‌గోల్డ్ రిమ్‌లెస్ కళ్ళద్దాలు. పల్చటి నెరసిన జుట్టు. నోట్లో పైప్. చేతిలో వాకింగ్ స్టిక్.

"జాగ్రత్త. త్వరలో వచ్చి తీసుకుంటాను. నన్నే మోసంచేయాలని ప్రయత్నిస్తే, నేను జైల్లోవున్నా నీకు చావు తప్పదు.

మరుక్షణం జీప్ ముందుకు దూకింది.

ఆ బూడిదరంగు అంబాసిడరు కారు నంబరు ఎక్కడా కాగితం మీద రాసుకోలేదు మార్కండేయ మనసులోనే మననం చేసుకోసాగాడు.

తన హోటల్ గదినంబరు అరవై ఎనిమిది. ఆ అంబాసిడరుకారు నంబరు అరవై ఎనిమిది. అరవైఎనిమిది చాలా తేలిక గుర్తు పెట్టుకొనడం ఆ కారునంబరు ద్వారా ఇంటి చిరునామా సంపాదించవచ్చు.

ఆ సందులోంచి మరో సందులోకి తిరుగుతూ వెనక్కి తిరిగి చూసాడు మార్కండేయ. సైరన్ శబ్దంవిని.

ఆ మూడు పెట్రోల్ కార్లు అంబాసిడరు కారుదగ్గర ఆగలేదు. జీప్ వెనకే వస్తున్నాయి, దాన్నిదాటి

మార్కండేయ మనసు కుదుటపడది. పోలీసులు ఆ డబ్బు స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేయలేదు. అంటే వాళ్ళకి తెలియదు. ఆ డబ్బు ఎక్కడుందో. తను పట్టుపడ్డా, డబ్బు సురక్షితంగా వుంటుంది. పోలీసుల నుంచి దూరంగా.

మరో సందుతిరిగి మెయిన్‌రోడ్డుమీదకి వచ్చాడు మార్కండేయ మళ్ళీ. అంబాసిడరు కారులో వున్నతని రూపం మనసులో మననంచేసు కుంటున్నాడు మార్కండేయ.

కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. నిస్సత్తువ పూర్తిగా ఆక్రమిస్తోంది ఒళ్ళంతా. స్టీరింగ్ వీల్ కంట్రోల్ తప్పుతోంది.

బ్రేక్స్ వేసి, వేగం తగ్గిస్తూ స్టీరింగ్ వీల్ మీదకి వాలిపోయాడు మార్కండేయ.

స్పృహ తప్పుతూండగా, పోలీస వేన్లు వెనకాల ఆగటం, పోలీసులు వేన్లోంచి బయటకి దిగటం, లీలగా వినిపించింది మార్కండేయకి.

* * *

"నాకు తెలీదు"

ఎదురుగా, కుర్చీమీద కూర్చునివున్న పోలీసు ఇంటరాగేటర్ వంక చూస్తూ అన్నాడు మార్కండేయ.

"అబద్ధం ఆడక. నీకు తెలియకుండా ఆ కేష్‌బాక్సు ఎలా మాయమవుతుంది?" అరిచాడు పోలీస్ ఇంటరాగేటర్ కోపంగా.

"ఏమో? పోలీసులే లాగేసి వుండవచ్చు"

"నీ స్నేహితుడు చచ్చిపోయాడు. అతని శవం పూర్తిగా వెతికాం జీపులో ప్రతీ సట్టూ, స్క్రూ కూడా గాలించాం. దొరకలేదు. నువ్వే ఎక్కడో దాచివుంటావు.

"ఏమో నాకు గుర్తులేదు" అన్నాడు మార్కండేయ కుడిచేతికి వున్న బేండేజ్ సరిచేసుకుంటూ.

"షైమయిపోయింది" పోలీస్ హాస్పిటల్‌లో మార్కండేయని ట్రీట్ చేస్తున్న డాక్టరు చెప్పాడు ఇంటరాగేటర్‌కి.

"రేపు విడుదల చేస్తున్నారు నిన్ను జైలులో నీచేత నిజం కక్కించలేకపోము"

బయటకి వెళ్ళిపోయాడు ఇంటరాగేటర్. ఇంటరాగేటర్ వెళ్ళిపోగానే ఆ రోజు దినపత్రిక తెరిచాడు మార్కండేయ.

చిన్నగా నవ్వుకున్నాడు తనగురించి అంతవరకు జరిగింది ప్రచురించిన విషయాలు చదివి. మళ్ళీ ఓసారి చదువుకున్నాడు మనసులోనే.

పేపర్ మడిచి మంచంమీద పడుకుని ఆలోచించసాగాడు మార్కండేయ.

ఈ నెల రోజుల్లో మూడుసార్లు ప్రయత్నం చేశాడు తను పారిపోవాలని కాని మూడుసార్లు పట్టుబడ్డాడు. పారిపోతు ఓ డాక్టరిని తను దొంగతనంగా సంపాదించిన కత్తితో పొడవడం వల్ల కాపలా ఇంకా కట్టుదిట్టం చేశారు.

మార్కండేయ అంబాసిడర్ కారు నంబరు, అతని రూపురేఖలు మననం చేసుకుంటూనే వున్నాడు రోజూ మర్చిపోకుండా వుండేందుకు.

రోజూ కోర్టుకి వెడుతున్నా, మనసు మాత్రం తను దొంగిలించిన ఇరవై రెండు లక్షలచుట్టూ తిరుగుతోంది. ఆ రిమ్‌లెస్ కళ్ళద్దాలతను డబ్బు తీసుకుని పారిపోతాడనే భయం. దిగులు మనసుని తినివేస్తున్నాయి. పోలీసులు ఎన్నివిధాల హింసించినా డబ్బుగురించిమాత్రం చెప్పలేదు మార్కండేయ.

ఎలాగయినా తప్పించుకోవాలి. ఆ డబ్బు చేజిక్కించుకోవాలి. తనుపడ్డ కష్టానికి ఫలితం మరొకరు అనుభవించకూడదు. ఇంకా పారిపోయేందుకు మార్గాలు అన్వేషిస్తున్నాడు మార్కండేయ.

ఉరిశిక్ష విధించారు కోర్టువారు మార్కండేయకి.

కేపిటల్ పనిష్మెంట్.

ఇరవై నాలుగు పేజీల తీర్పు చదివాడు జడ్జి తన నేరాల గురించి. ఉరిశిక్ష విధించబడ్డదని చెప్పబోయేముందు.

స్వయంగా తన చెవులతో ఉరిశిక్ష విధించబడ్డదని విన్నా, చలించలేదు మార్కండేయ.

ఇంకా పారిపోవాలనే ఆలోచన, ఆ డబ్బు చేజిక్కించుకోగలననే ఆశ, పారిపోగలననే ధైర్యం.

ఉరిశిక్ష పదేరోజు దగ్గరయేకొలదీ, తను పారిపోలేననే అధైర్యం ఆ ఇరవై రెండు లక్షలూ తను అనుభవించలేనేమోననే దిగులు అధికం కాసాగాయి మార్కండేయలో.

అర్ధరాత్రి జైల్లో నిద్రపోతూ, అదేపనిగా కలవరిస్తాడు. అరు

స్తాడు. జుట్టు పీక్కుంటాడు పిచ్చిగా. వదిలిపెట్టమని దీనంగా అడుగుతాడు కాపలావాడిని.

ఆ రోజు—

ఉరిశిక్ష అమలు జరిపే రోజు.

ఉదయం మళ్ళీ పోలీస్ ఇంటరాగేటర్స్ అడిగారు డబ్బు గురించి.

"హిమాలయ పర్వతాల్లో దాచాను. పొండి వెతుక్కోండి"

అరిచాడు కోపంగా. వెంటనే పకపకా నవ్వాడు పిచ్చివాడిలాగా.

ఉరి తీసేందుకు అంతా సిద్ధం చేశారు. మార్కండేయ గుండె పూర్తిగా దిగులుతో నిండిపోయింది.

ఎందుకు ఉరి తీయబడుతున్నదీ చెపుతున్నారు. ఉరి తీసే వేదిక మీద మార్కండేయని నించోబెట్టి.

దూరంగా వస్తున్న బూడిదరంగు అంబాసిడర్ కారుని చూసి కళ్ళు చిట్లించాడు మార్కండేయ.

కళ్ళు నెంబరు ప్లేటుమీద పడ్డాయి.

ఆరూ ఎనిమిదీ, ఆరు ఎనిమిదీ! హృదయం ఆనందంతో నిండిపోయింది మార్కండేయకి.

కారు ఆగింది కొంచెం దూరంలో.

కారులోంచి, తలుపు తెరుచుకుని కిందకి దిగిన వ్యక్తిని చూడగానే గుండెల్లోని దిగులు ఎగిరిపోయింది.

రిమ్‌లెస్ కళ్ళద్దాలు సవరించుకుని, నోట్లోని పైపు పీలుస్తూ, చేతిలోని వాకింగ్ స్టిక్ సహాయంతో కుంటుకుంటూ వస్తున్న ఆ ముసలాయనని చూడగానే ఆనందం పట్టలేక అరిచాడు మార్కండేయ గట్టిగా, వేదిక మీదనుంచి.

"ఏయ్! నువ్వే నువ్వే, నా డబ్బు ఎక్కడుంది?"

పోలీస్ అధికారులు నలుగురూ బలవంతంగా మార్కండేయని

పట్టుకుని, ఆపి మొహంమీద నల్లసంచీని తొడిగారు. అతని పిచ్చి వాగుడిని ఎవరూ లెక్క చేయలేదు.

"వాడే నా డబ్బు తీసుకుంది. నేనే ఇచ్చాను"

అరుస్తున్నాడు మార్కండేయ ఆనందం, ఉత్సాహం నిండిన కంఠంతో.

మార్కండేయ మెడచుట్టూ ఉరితాడు తగిలించారు.

"ఎక్కడుంది నా డబ్బు?"

ఉరితాడు మార్కండేయ గొంతుచుట్టూ బిగించారు బిగుతుగా.

"మాట్లాడవేం? ఎక్కడుంది నా డబ్బు? చెప్పు!"

"అరవకు ఆఖరి క్షణాల్లో. భగవంతుని తలచుకో" చెప్పారు అధికారులు.

"నిన్నే! చెప్పు. నా ఇరవై రెండు లక్షలు"

గొంతు చించుకున్నాడు మార్కండేయ.

అధికారి సౌంజ్ఞ చెయ్యగానే బలంగా లాగాడు హేండిల్‌ని ఉరితీసే ఉద్యోగి.

వెంటనే మార్కండేయ కాళ్ళకింద చెక్క పక్కకు తొలగిపోయింది. కాళ్ళకింద ఆధారం పోగానే, గాలిలో తేలుతున్నాడు మార్కండేయ మెడచుట్టూ బిగుసుకుంటున్న వురితాడుతో.

"నా డబ్బు.... చెప్పు.... నా డబ్బు....!"

గొణిగాడు మార్కండేయ తన జీవితంలో ఆఖరి క్షణాల్లోకూడా.

క్రమంగా మాటలు మూలుగుగా మారిపోయింది నిముషాలు గడిచాయి. గాలిలో కొట్టుకుంటున్న కాళ్ళు ఆగిపోయాయి క్రమంగా.

తాడునుంచి వూగుతున్న మార్కండేయలో చలనంలేదు.

"చివరి క్షణాల్లోకూడా ఆ డబ్బు ఎక్కడ దాచాడో చెప్పలేదు సార్!"

నిశ్శబ్దాన్ని చీలుస్తూ చెప్పాడు ఓ పోలీస్ ఆఫీసర్ ఆ కళ్ళద్దా లతనికి.

"కొద్ది రోజులుగా అతనికి పిచ్చి పట్టింది సార్! తను పారిపోగల ననే ధైర్యంతో వున్నాడు. ఇక చచ్చిపోతాననే భయం కలగగానే పిచ్చి వాడయ్యాడు."

మరో పోలీస్ అధికారి అన్నాడు.

"ఎన్ని హత్యలు చేశాడో పాపి?"

కసిగా అన్నాడు వురితీసే ఉద్యోగి.

"పాపం పూర్ ఫెలో" సానుభూతి చూపాడు జైలరు. తన రిమ్ లెస్ కళ్ళజోడు సవరించుకుంటూ అందరికీ సమాధానంగా.

విలాసంగా పొగవదులుతూ వాకింగ్‌స్టిక్ ఆధారంతో నిలబడి మార్కండేయ శవం వంక దర్పంగా చూస్తూండిపోయాడు జైలర్ కొన్ని క్షణాలదాకా.

(అపరాధ పరిశోధన సెప్టెంబరు 1972)